


గోదావరిలో భక్తుల రద్దీ

ధర్మపురి: గోదావరికి భక్తులు పోటెత్తారు. నట్టిమాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి గంగమ్మ, గౌరమ్మలకు మొక్కులు చెల్లించారు.



'వేరుశనగ'పై ఆశలు!

జగిత్యాల అగ్రికల్చర్: జిల్లాలో వేరుశనగ సాగు ఘననీయంగా పెరిగింది. పంటకూడా ఆశాజనకంగా ఉండడంతో మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని రైతులు భావిస్తున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 25.0/12.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం దట్టమైన పొగమంచు కురిసే అవకాశముంది. చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ప్రజాపాలనకు అందని ఆహ్వానం

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అసంతృప్తి



దావ వసంత

జగిత్యాలజోన్: కరీంనగర్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన సన్నాహక సమావేశానికి ఆహ్వానించకపోవడంపై జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రమంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు పాల్గొన్న ఈ సన్నాహక సమావేశానికి జెడ్పీ చైర్మన్లను ఆహ్వానించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ఉండి.. ఎప్పటికప్పుడు ప్రజాసమస్యలు తెలుసుకునే తమను పిలవకపోవడం విడ్డూరమని పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నం ఎంపీపీపై అవిశ్వాసం



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డిపై అవిశ్వాసం పెడుతున్నట్లు బుధవారం మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు ఎంపీటీసీలు వినతిపత్రం అందించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ పాలనలో నిర్లక్ష్యం, పక్షపాతం వహించి అవినీతికి పాల్పడ్డారని, వారిపై అవిశ్వాసం పెట్టేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరారు. నోటీసు అందించిన వారిలో ఎంపీటీసీలు దెశెట్టి మమత, బొరిగం వివేకవర్ధిని, బాశెట్టి రాధ, తిమ్మణి రాములు, పడాల మమత, పానకంటి చిన్న వెంకట్, మాలవత్ సరోజన, దెశెట్టి శాంత, అక్కెనపల్లి జలేశ్ పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధం



అర్పపల్లిలో మాట్లాడుతున్న శ్రీనివాస్

సారంగాపూర్: లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట విరుద్ధమని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని అర్పపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాలను గ్రామస్తులకు వివరించారు. ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారు ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేవై)లో చేరాలని, దీనిద్వారా గుర్తించిన ఆస్పత్రుల్లో రూ.5లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు అందుతాయని తెలిపారు. గ్రామాల్లో క్షయవ్యాధితో బాధపడుతున్న వారికి పౌష్టికాహారం అందించడానికి దాతలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాణిమైత్రీ రెడ్డి, సర్పంచ్ కొండ శ్రీలత, అంగన్‌వాడీ, ఆశాలు పాల్గొన్నారు.

వికసిత భారత్ సంకల్ప్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కృష్ణహరి

జగిత్యాలటౌన్: వికసిత భారత్ సంకల్ప్ యాత్ర పోస్టర్‌ను బీజేపీ బల్దియా ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి బుధవారం అధికారులతో కలిసి ఆవిష్కరించారు. బల్దియా డీఈ రాజేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, బీజేపీ జిల్లా మహిళా కార్యదర్శి సాంబారి కళావతి, పట్టణ ఉపాధ్యక్షులు గాదాసు రాజేందర్, బైరి రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఆరు గ్యారంటీలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

- 'ప్రజాపాలన'పై నిర్లక్ష్యం వద్దు
- 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తాం
- ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వానికి బాసటగా నిలవాలి
- రేషన్ బియ్యం రీసైక్లింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తాం
- నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా 6 గ్యారంటీలను అమలు చేస్తామని, ఆ దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజాపాలన గ్రామ, వార్డుసభల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని బాధ్యతయుతంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం చేయవద్దన్నారు. గ్యారంటీల అమలులో ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, ఒక గ్రామంలో ఏర్పాటు చేసిన కౌంటర్ 10 రోజులపాటు ఉంటుందని, దరఖాస్తుదారులు వీలైన రోజు అర్జీలను అందజేయవచ్చని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను డిజిటలైజ్ చేయాలన్నారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

ఫాంలను ముందే ఇవ్వండి

దరఖాస్తు ఫాంలను ముందుగానే ఇస్తే లబ్ధిదారులు వాటిని నింపి, తీసుకువస్తారని, ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతీ వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని, తోపులాట జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో నీటిపారుదల శాఖ ప్రాజెక్టుల పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. రేషన్ బియ్యం రీసైక్లింగ్‌పై కఠినంగా వ్యవరిస్తామన్నారు. సమావేశంలో కరీంనగర్ ఇన్‌చార్జి కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, రాజన్నసిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి, జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ సంజయ్ కుమార్, చింతకుంట విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి, ఉమ్మడి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను తిరస్కరించవద్దు : మంత్రి పొన్నం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 2 రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశాం. మిగతా నాలుగింటిని తప్పకుండా అమలు చేస్తాం. ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన ఏ ఒక్క దరఖాస్తును అధికారులు తిరస్కరించవద్దు.

పేదల ముఖంలో చిరునవ్వే లక్ష్యం : మంత్రి శ్రీధర్‌బాబు

పేదల ముఖంలో చిరునవ్వే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది. ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ వంద రోజుల్లో అమలు చేసి చూపిస్తాం. అధికారులు ప్రతీ కౌంటర్ వద్ద నిరక్షరాస్యుల కోసం సహాయకులను నియమించాలి. ప్రజలు అధిక సంఖ్యలో వస్తే టోకెన్లు ఇవ్వాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రశ్నల వర్షం

- ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ సంజయ్‌కుమార్, పాడి కౌశిక్‌రెడ్డిలు అందరి కంటే ముందే వచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అధికారులతో వేదిక కింద కూర్చున్నారు.
- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, గృహలక్ష్మి పథకాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఇది వరకు అర్జీ పెట్టుకున్నవారు మళ్లీ చేసుకోవాలా? అని ప్రశ్నించడంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. వారు అర్హులేనని, కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. పెంచిన పింఛన్లనూ అందిస్తామని పేర్కొన్నారు.
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి అధికారులు అడ్డు చెబుతున్నారని, దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి త్వరలో జరిగే కేబినెట్ సమావేశంలో మాట్లాడి, చెబుతామని అన్నారు.
- సమావేశానికి మాజీ మంత్రులు, సిరిసిల్ల, కరీంనగర్ ఎమ్మెల్యేలు కేటీఆర్, గంగుల కమలాకర్ గైర్హాజరయ్యారు.

నల్లనేలపై ఎర్రజెండా



గెలుపుతో ఏఐటీయూసీ నాయకుల సంబరాలు

- 'గుర్తింపు' ఎన్నికల్లో ఏఐటీయూసీ ఆధిపత్యం
- ఐఎన్‌టీయూసీతో హోరాహోరి పోరు
- ప్రాభవం కోల్పోయిన టీబీజీకేఎస్

సాక్షి, పెద్దపల్లి/గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం కోసం బుధవారం జరిగిన ఎన్నికల్లో ఏఐటీయూసీ ముందంజలో నిలిచింది. సింగరేణి గుర్తింపు కార్మిసంఘం ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు బుధవారం అర్ధరాత్రి దాకా కొనసాగింది. తొలుత బోణీ కొట్టిన ఐఎన్‌టీయూసీ ఆరు ప్రాంతాల్లో, ఏఐటీయూసీ ఐదు ఏరియాల్లో విజయం సాధించి ప్రాతినిధ్యం దక్కించుకున్నాయి. అయితే, అత్యధిక ఓట్లు సాధించిన ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా ఆవిర్భవించింది. సింగరేణిలోని 11 ఏరియాల్లో 13 కార్మిక సంఘాలు పోటీచేయగా కేవలం సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ, కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ మధ్యే పోటీ కనిపించింది. బుధవారం అర్ధరాత్రి వరకు సాగిన ఓట్ల లెక్కింపు వివరాలు ఇలా.. ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం కార్పొరేట్, ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, రామగుండం 3, భూపాలపల్లిలో ఏరియాలో ప్రాతినిధ్యసంఘంగా గెలుపొందింది. ఇక ఏఐటీయూసీ యూనియన్ రామగుండం -1, రామగుండం -2, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లో ప్రాతినిధ్య సంఘంగా మొత్తం 5 చోట్ల విజయం సాధించింది. మొత్తానికి సింగరేణి సంస్థలో గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ విజయబావుటా ఎగురవేసింది. పోటీచేసిన 11 స్థానాల్లో ఐఎన్‌టీయూసీకి 6 స్థానాల్లో మొత్తం: 14,215 ఓట్లు రాగా, ఏఐటీయూసీకి 5 స్థానాల్లో మొత్తం 16,177 ఓట్లు వచ్చాయి. మిగిలిన ఓట్లు ఇతర యూనియన్లు పంచుకున్నాయి. కాగా, గత రెండు పర్యాయాలు పోలింగ్‌లో సత్తా చాటిన టీబీజీకేఎస్ ఈసారి ఎన్నికల్లో పూర్తిగా డీలా పడిపోయింది.



ఏఐటీయూసీ నాయకుల గెలుపు సంబరాలు



ఏఐటీయూసీ జెండా

రెండు ఏరియాల్లో ఏఐటీయూసీదే విజయం

రామగుండం రీజియన్‌లో బుధవారం నిర్వహించిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సీపీఐ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రెండు ఏరియాల్లో విజయం సాధించింది. ఒక ఏరియాలో ఐఎన్‌టీయూసీ గెలుపొందింది. రామగుండం రీజియన్‌లో మూడు ఏరియాలు ఉండగా అందులో రెండింటిలో ఏఐటీయూసీ జయకేతనం ఎగురవేసింది. ఆర్జీ-1 ఏరియాలో 5,044 ఓట్లు పోల్‌కాగా అందులో 1,983 ఓట్లు సాధించి ఏఐటీయూసీ విజయం సాధించింది. 1,566 ఓట్లతో ఐఎన్‌టీయూసీ రెండో స్థానంలో నిలిచింది. ఆర్జీ-2 ఏరియాలో 3,369ఓట్లు పోల్‌కాగా అందులో 1,357ఓట్లు సాధించి ఏఐటీయూసీ విజయం సాధించగా, ఐఎన్‌టీయూసీ 1,024ఓట్లతో రెండోస్థానంలో నిలిచింది. ఆర్జీ-3 ఏరియాలో 3,612 ఓట్లు పోల్‌కాగా అందులో ఐఎన్‌టీయూసీ 1,360 ఓట్లు సాధించి విజయం కైవసం చేసుకుంది. 1256ఓట్లు సాధించి ఏఐటీయూసీ రెండోస్థానంలో నిలిచింది.

పెరిగిన సైబర్ మోసాలు

- స్వల్పంగా తగ్గిన నేరాలు..
- కలవరపెట్టిన రోడ్డు ప్రమాదాలు
- ఈ ఏడాది ఇప్పటివరకు 5,070 కేసుల నమోదు
- ట్రాఫిక్ ఆంక్షల ఉల్లంఘనులకు రూ.2కోట్ల జరిమానా



జగిత్యాలజోన్: జిల్లాలో గతేడాదితో పోల్చితే ఈ ఏడాది నేరాల శాతం స్వల్పంగా తగ్గినా.. సైబర్ మోసాలు.. రోడ్డు ప్రమాదాలు.. మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి. 2022లో ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో 5,120 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 5,070 కేసులు నమోదయ్యాయి. ఇందులో హత్యలు, దొంగతనాలు, అత్యాచారాల వంటి క్రిమినల్ నేరాలవి 3,842 ఉండటం గమనార్హం.

రూ.2.22కోట్ల ఆస్తులు నష్టం

గతేడాది వివిధ నేరాల ద్వారా ప్రజలకు చెందిన రూ.1.90 కోట్ల ఆస్తులు(బంగారం, డబ్బులు) నష్టం కాగా.. ఈ ఏడాది రూ.2.22 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఈ ఏడాది పోలీసులు రూ.71.44 లక్షలు, బంగారం స్వాధీనం చేసుకున్నారు. మహిళలపై గతేడాది 547 నేరాలు జరిగితే.. ఈ ఏడాది 644కు పెరిగాయి. ఎస్సీ, ఎస్టీలపై గతేడాది 100 నమోదైతే.. ఈ ఏడాది 117 కేసులకు పెరిగాయి.

పెరిగిన రోడ్డు యాక్సిడెంట్లు

జిల్లాలో గతేడాది 399 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ఏడాది 9.77శాతం పెరిగి 438కు చేరడం ఆందోళన కలిగించే విషయం. ఈ ప్రమాదాల్లో 169 మంది చనిపోయారు. 234 ఘటనల్లో చాలామంది గాయాలతో బయటపడ్డారు. ఈ ఏడాది 28 హత్యలు, 21 దోపిడీలు, 306 ఆస్తి దొంగతనాలు, 48 కిడ్నాప్, 347 చీటింగ్, 66 హత్యాయత్నం, అత్యాచారం 42, ఇతర 1928 కేసులు నమోదయ్యాయి. పోలీసులు 113.2 తులాల బంగారం, 1508 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు.

పెరిగిన సైబర్ క్రైం

జిల్లాలో సైబర్ నేరాలు భారీగా పెరగడం ప్రజలను ఆందోళన కలిగిస్తోంది. గతేడాది 635 సైబర్ నేరాల కేసులు నమోదైతే ఈ ఏడాది 866 కేసులు నమోదయ్యాయి. గతేడాది సైబర్ క్రైం ద్వారా రూ.1.92 కోట్లు పోగొట్టుకుంటే.. ఈ ఏడాది రూ.8.61 కోట్లు పోగొట్టుకున్నారు. పోలీసులు స్పందించి రూ.8.61 కోట్లలో రూ.5.07కోట్లు పట్టుకోవడం విశేషం. 1930సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసిన వాటిలో 123 కేసులు నమోదు చేసి, రూ.4.52 లక్షలు రికవరీ చేశారు. కోరుట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్ కేసులో రూ.36 లక్షలు, జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫ్రాడ్‌కాల్ కేసులో రూ.4లక్షలు రికవరీ చేయడం గమనార్హం.

గంజాయిపై ఉక్కుపాదం

గంజాయి.. కొకైన్‌తో యువత వ్యసనాలకు బానిస కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది పోలీస్ శాఖ. గతేడాది 13 కేసుల్లో 36 మంది అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.6.89 లక్షల విలువైన 91.54కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ట్రాఫిక్ ద్వారా రూ.2 కోట్ల జరిమానా

డ్రంకెన్‌డ్రైవ్ కింద 5,882 కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలు ఉల్లంఘించిన 3,774 మందిపై కేసు నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడిన వారికి రూ.2కోట్ల వరకు జరిమానా విధించారు.

మహిళల రక్షణకు ప్రత్యేక వింగ్

మహిళల రక్షణకు షీ టీం ద్వారా ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేశారు. 198 అవగాహన సమావేశాల ద్వారా 25వేల మందికి విద్యార్థినులు, మహిళల్లో చైతన్యం తీసుకొచ్చారు. దీనికితోడు 12 బాల్యవివాహాలను అడ్డుకున్నారు. విద్యార్థినులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై 12 కేసులు నమోదు చేసి 18 మందిని అరెస్ట్ చేశారు.



పట్టుబడిన గుట్కా, నిందితులతో పోలీసులు (ఫైల్)

12 మందిపై పీడీ యాక్ట్

జిల్లాలో పదేపదే నేరాలకు పాల్పడే 12 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే 697 మందిపైనా కేసులు నమోదు చేశారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న 161 మందికి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా జిల్లా పోలీసులు వాటిని గుర్తించి బాధితులకు అప్పగించారు.

526 కేసుల్లో కోర్టు శిక్షలు

వివిధ కోర్టుల్లో 526 కేసుల్లో శిక్షలు పడ్డాయి. ఇందులో 13 కేసుల్లో యావజ్జీవం.. ఓ కేసులో పదేళ్ల జైలు, మరో కేసులో ఏడేళ్ల జైలు, ఐదు కేసుల్లో మూడేళ్ల జైలు శిక్షలు పడ్డాయి. 10 హత్య కేసుల్లో నిందితులకు యావజ్జీవం పడింది. జిల్లాలోని అన్ని కోర్టుల్లో జరిగిన లోక్ అదాలత్ ద్వారా ఈ ఏడాది 1195 క్రిమినల్ కేసులు, 10089 పీటీ కేసులు, 6979 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు.. మొత్తం 18,263 కేసులు పరిష్కరించారు.

అక్రమ తరలింపునకు అడ్డుకట్ట

రేషన్ బియ్యం, ఇసుక రవాణా, జూదం వంటి వాటిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. 2023లో రేషన్ బియ్యం అక్రమ రవాణాలో 29 కేసులు నమోదు చేసి.. రూ.10.40 లక్షల విలువైన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. జూదంలో 78 కేసులు నమోదు చేసి.. రూ.18.66 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఇసుక రవాణాపై 47 కేసులు నమోదు చేసి రూ.2.46 లక్షల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.

సామాజిక చైతన్యం

జిల్లాలో ప్రజలను వివిధ అంశాలపై చైతన్యం చేసేందుకు పోలీస్ కళా బృందాలు 192కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల సహకారంతో నేరాలు పసిగట్టేందుకు 1613 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లా పోలీస్ శాఖ ద్వారా ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వగా.. 1682 మంది శిక్షణపొంది, 380మంది వివిధ పోస్టులకు అర్హత సాధించారు.

ఎవరినీ ఉపేక్షించం



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జిల్లాలో నేర ప్రవృత్తి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నేరాలపై సమీక్షించారు. సైబర్‌మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో నేరాలు తగ్గించేందుకు పోలీసుశాఖ 24గంటలూ పనిచేస్తుందన్నారు. పోలీస్‌కు సహకారం అందిస్తే.. నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు ఎక్కడ కనబడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడిషన్ ఎస్పీలు భీంరావు, జనార్దన్ రెడ్డి, రంగారెడ్డి, డీఎస్పీలు రవీందర్‌రెడ్డి, వెంకటస్వామి, సీఐలు వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. – సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ

ఓట్ల కోసమే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు

- ఎంపీ అరవింద్

సారంగాపూర్: రాష్ట్రం అప్పుల్లో ఉందని తెలిసీ కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఆరు గ్యారంటీలు ఇచ్చి ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. బీర్‌పూర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం రూ.ఏడు లక్షల కోట్లు అప్పుల్లో ఉందని ఎన్నికల్లో ప్రచారం చేసిన కాంగ్రెస్.. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించి శ్వేతపత్రం విడుదల చేయడమేంటని ప్రశ్నించారు. శ్వేతపత్రం తరహాలోనే కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులు.. దేనికి ఖర్చు చేశారో కూడా ప్రకటించాలన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను గత ప్రభుత్వం ఇష్టారీతిన మళ్లించిందన్నారు. ఏడాది క్రితం బీజేపీకి ఉన్న క్రేజ్ ఇప్పుడు తగ్గిందని, ఇందుకు బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని కాంగ్రెస్ ప్రచారం చేయడమే కారణమన్నారు. విద్యుత్ ఉత్పత్తి ఎలా పెంచాలి..? రైతులను ఎలా ఆదుకోవాలి..? రాష్ట్రం ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు తీసుకునే చర్యలపై ఆలోచన చేయాలని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు బోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణరావు, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల అధ్యక్షులు ఎండబెట్ల వరుణ్, మ్యాడ జనార్దన్, ప్రధాన కార్యదర్శులు దీటి వెంకటేశ్, ఆడెపు రమేశ్, అప్పాల జలేందర్ తదితరులు పాల్గొన్నారు.



బీర్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

నేటి నుంచి ప్రజాపాలన

- ఒక ఇంటికి ఒకే దరఖాస్తు
- గ్రామాల్లో సభలు
- మున్సిపాలిటీల్లో దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: నేటినుంచి జనవరి 6 వరకు జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీ వార్డుల్లో ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. ఈ పథకం కింద మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, చేయూత కింద లబ్ధికోసం గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో నిర్వహించే సభల్లో కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల జనాభా ఆధారంగా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని, పురుషులు, మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేకంగా కౌంటర్లు ఉంటాయన్నారు. వారంపాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి అధికారులు ప్రజల వద్దకు వెళ్లి దరఖాస్తులు స్వీకరించడంతోపాటు, వారికి సేవలు అందిస్తారని పేర్కొన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి అధికారులను నియమించామన్నారు. ఉదయం 8 గంటల నుంచి 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.



కలెక్టర్ యాస్మిన్ బాషా

క్లుప్తంగా

ప్రభుత్వంలో పంచాయతీ కార్యదర్శులది కీలక పాత్ర

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసిన కార్యదర్శులు

జగిత్యాలటౌన్: సంక్షేమ పథకాల అమలులో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పంచాయతీ కార్యదర్శులు, పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ ఆలోచనా విధానాలకు అనుగుణంగా పనిచేయడం సహజమని అన్నారు. నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేర్చాలని సూచించారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే ప్రజాపాలనలో ఆరు గ్యారంటీల లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరించాలని కోరారు.

ఉద్యోగావకాశాలు

జగిత్యాలటౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 29న ఉదయం 11గంటలకు జగిత్యాల కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి బింగి సత్తమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని హ్యాతిన్ టీవీఎస్ ఆథరైజ్డ్ కంపెనీలో సేల్స్ మేనేజర్, స్పేర్‌పార్ట్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ సూపర్‌వైజర్స్, మెకానిక్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు మొదలగు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, అర్హత, అనుభవం కలిగిన అభ్యర్థులు హాజరు కావాల్సిందిగా కోరారు. జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని రూం నంబరు 218లో ఉదయం 11గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని సూచించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన నలువాల మణికంఠ(20) క్రిమిసంహారక మందుతాగి మంగళవారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హనుమాన్‌వాడకు చెందిన మణికంఠ పుట్టుకతోనే మూగవాడు. గత కొద్దికాలంగా మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంటివద్ద క్రిమిసంహారక మందుతాగాడు. కుటుంబసభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

వరికుప్పలు దగ్ధం

కాల్వశ్రీరాంపూర్: ఆరుగాలం కష్టపడ్డారు. పంట చేతికొచ్చింది. కోపిద్దామంటే హార్వెస్టర్‌కు డబ్బులు చెల్లించేంత స్థోమత లేదు. దీంతో కోసిన పంటను రోడ్డుపై వేశారు. వాహనాల తాకిడికి ధాన్యం గింజలు రాలుతాయని భావించారు. మంగళవారం రాత్రి ఆ వరికుప్పలకు నిప్పు అంటుకుంది. వరిధాన్యం కాలి బూడిదయ్యింది. ఈ ఘటన మండలంలోని వెన్నంపల్లిలో చోటు చేసుకుంది. బాధిత రైతు తాటికంటి సమ్మయ్య వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సమ్మయ్య గ్రామంలో తెలిసిన వారి భూమి కౌలుకు తీసుకుని వరిపంట వేశారు. వరి కోతకు రాగా హార్వెస్టర్‌తో కోపిచ్చేంత స్థోమత లేదు. దీంతో సమ్మయ్య దంపతులు కోసిన వరిని కట్టలుగా కట్టి రోడ్డుపై వేశారు. వచ్చిపోయే లారీలు, వాహనాలు తాకిడికి గింజలు రాలుతాయని తదుపరి తూర్పార పట్టుకుంటే కొంతఖర్చు తగ్గుతుందని ఆశించాడు. ఇంతలో మంగళవారం రాత్రి వరికుప్పలు దగ్ధం అయ్యాయి. బుధవారం సమ్మయ్య దంపతులు వెళ్లి చూసేసరికి పంట మొత్తం కాలి బూడిదైంది. అప్పుతెచ్చి పెట్టుబడి పెట్టామని, ఆరుగాలం కష్టం బూడిదయ్యిందని బోరున విలపించారు. రూ.80వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


అయ్యప్ప మెట్ల పూజ చేస్తున్న అర్చకులు


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామివారు


వేడుకకు హాజరైన భక్తులు

వైభవంగా అయ్యప్ప జాతర


వేడుకకు హాజరైన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

కోరుట్ల/కోరుట్ల రూరల్: పట్టణ శివారులోని అయ్యప్ప గుట్టపై ఉన్న ఆలయంలో జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. అయ్యప్ప స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు, మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నం లావణ్య, ఆలయ గౌరవ అధ్యక్షుడు, గురుస్వామి చిద్రాల నారాయణ స్వామి, అంబటి శ్రీనివాస్ స్వామి, భక్తులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్

వేరుశనగపై ఆశలు!

- జిల్లాలో పెరిగిన సాగు
- మరో 15 రోజుల్లో పంట చేతికి
- మార్కెట్లో పచ్చిపల్లికాయకు డిమాండ్
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

జగిత్యాల అగ్రికల్చర్: జిల్లాలో వేరుశనగ సాగు ఘననీయంగా పెరిగింది. పంటకూడా ఆశాజనకంగా ఉండడంతో మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని రైతులు భావిస్తున్నారు. మరో 15 రోజుల్లో పంట చేతికి రానుండగా.. పచ్చిపల్లికాయ రూ.50నుంచి రూ.60 వరకు పలుకుతోంది. దీంతో మంచి దిగుబడి వస్తుందని భావిస్తున్న రైతులకు అనుకున్నస్థాయిలో ఆదాయం సమకూరుతుందని ఆశలు పెట్టుకున్నారు.

జిల్లాలో 10వేల ఎకరాల్లో సాగు

జిల్లాలో దాదాపు 10వేల ఎకరాల్లో వేరుశనగ సాగుచేశారు. జగిత్యాల, గొల్లపల్లి, మెట్‌పల్లి, మల్లాపూర్ ప్రాంతాల్లో ఎక్కువగా పల్లిని పండిస్తున్నారు. వానాకాలం పంటగా మొక్కజొన్న అంతరపంటగా వేరుశనగను వేయడం పరిపాటి. జగిత్యాల మండలం లక్ష్మీపూర్ వంటి గ్రామంలోనే దాదాపు 70–100 ఎకరాల వరకు వేరుశనగ సాగవుతోంది. పచ్చి పల్లికాయకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో పాటు వినియోగదారులు రైతుల వద్దనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆశించిన ఆదాయం వస్తుందని రైతులు భావిస్తున్నారు.

పంటకు కాపలాగా..

జిల్లాలో ఎర్ర నేలలు ఎక్కువగా ఉండడంతో పల్లికాయ బాగా సాగవుతోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో పాటు రెండు, మూడు నీటి తడులు ఇస్తే భూమిలో కాయ బాగా ఊరుతుంది. కాయ ఊరే దశలో కోతులు, అడవి పందుల బెడద రైతులను తీవ్రంగా వేధిస్తోంది. దీంతో రైతులు రాత్రి, పగలు తేడా లేకుండా తోటలకు కాపలా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వ ప్రోత్సాహం

యాసంగిలో వరికి బదులు వేరుశనగను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు సరఫరా చేసింది. విత్తనాలు సాళ్ల పద్ధతిలో వేసి, నాలుగైదు నీటి తడులు ఇవ్వడంతో కాయలు బాగా వచ్చాయి. రైతులు నేరుగా అమ్ముకునే వెసులుబాటు లేనప్పటికీ.. మార్కెట్‌కు తరలించినా మంచి ధర వచ్చే అవకాశం ఉంది. ఇటీవల గానుగ నూనెపై వినియోగదారుల్లో అవగాహన పెరగడంతో, రైతుల వద్ద పల్లికాయ కొనుగోలు చేసి గానుగ ఆడించిన నూనె వినియోగిస్తున్నారు.


మోరపల్లిలో సాగవుతున్న వేరుశనగ

ఎకరంలో వేశాను



ఎకరంలో వేరుశనగ వేశాను. పంట బాగా వస్తుంది. మరో 15రోజుల్లో చేతికి వస్తుంది. పచ్చి పల్లికాయకు మంచి డిమాండ్ ఉంది. దీంతో పంట చేతికి రాగానే నేరుగా అమ్ముతాను.

– మిట్టపల్లి జయంత్, వేరుశనగ రైతు

మార్కెటింగ్‌కు ఇబ్బంది లేదు



జిల్లాలోని కొన్ని గ్రామాల్లోనే వేరుశనగ పంట వేస్తారు. కాబట్టి కాసిన పచ్చి పల్లికాయలను పక్క గ్రామాలకు తీసుకెళ్లితే బాగా అమ్ముడుపోతుంది. కాయలు అమ్ముడుపోవన్న ఇబ్బంది లేదు.

– సంగెపు జీవన్, వేరుశెనగ రైతు

అనువైన వాతావరణం



జిల్లాలో వేరుశనగకు అనువైన వాతావరణం ఉంది. యాసంగిలో ఎక్కువగా సాగు చేసారు. అక్కడక్కడ కోతుల బెడద వేధిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. కాయ అమ్ముడుపోదనే పరిస్థితి అయితే లేదు.

– పాక సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

- నాబార్డ్ డీడీఎం మనోహర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

జగిత్యాలరూరల్: మహిళా స్వశక్తి సంఘ సభ్యులు అవకాశాలను అందిపుచ్చుకుని, ఆర్థికాభివృద్ధి సాధించాలని నాబార్డ్ డీడీఎం మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన స్పందన ఎన్జీవో నాబార్డ్ ఆధ్వర్యంలో ఉచిత ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా స్వశక్తి సంఘ సభ్యులకు శిక్షణ ఇచ్చేందుకు స్పందన సొసైటీ వారు ముందుకు రావడం అభినందనీయమన్నారు. నాబార్డు ఇందుకు సహకారం అందిస్తుందని అన్నారు. గ్రామీణాభివృద్ధిశాఖ సహకారం తీసుకుని ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. స్పందన సంస్థ ఆర్గనైజర్ శోభరాణి మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో గ్రామీణ మహిళల అభివృద్ధి కోసం వివిధ రకాల ఉచిత శిక్షణలు ఇవ్వడం జరుగుతుందని, శిక్షణకాలం 15 రోజులు ఉంటుందని, శిక్షణ పొందే వారికి గౌరవ భత్యం, భోజన సదుపాయం, శిక్షణ పూర్తయిన అనంతరం నాబార్డ్‌వారు ధ్రువీకరణ పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. టీ లైఫ్ జిల్లా ఆర్గనైజర్ పొన్నాల శిరీషరెడ్డి, సర్పంచ్ పొగల్ల సంధ్యారాణి, ఎంపీటీసీ ఆరె సౌజన్య, ఉపసర్పంచ్ పడిగెల సునీత, ఏపీఎం గంగాధర్, సీసీలు రవీందర్, అధ్యక్షురాలు జ్యోతి, వీవోఏలు రమ, జయ, కవిత పాల్గొన్నారు.

ఘనంగా దొంగమల్లన్న జాతర


కొలువుదీరిన మల్లికార్జున స్వామి


బోనాలతో దర్శనానికి వెళ్తున్న భక్తులు

గొల్లపల్లి: గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జునస్వామి ఆలయం బుధవారం భక్తజనంతో కిటకిటలాడింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు రాజేందర్, రఘునందన్ పూజలు చేశారు. స్వామి వారికి ఇత్తడి బిందెలు, కొత్త కుండల్లో బోనాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. టికెట్ల ద్వారా రూ.59,780 ఆదాయం వచ్చింది. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, సర్పంచ్ సిద్దంకి నర్సయ్య, విద్యాకమిటీ చైర్మన్ సిద్దంకి మల్లారెడ్డి, ఎంపీటీసీ గోస్కుల రాజన్న, మాజీ సర్పంచ్ భీమ సంతోష్ ఉన్నారు.

కమ్ముకున్న పొగమంచు

గొల్లపల్లి: గొల్లపల్లిలో బుధవారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 9గంటలైనా పొగమంచు తగ్గలేదు. వాహనదారులు, పాదచారుల అవస్థలు పడ్డారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక భయంభయంగా ప్రయాణించారు.



పక్కా భవనాలపై పట్టింపేది?


గోపులాపూర్ రోడ్డులో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి కేటాయించిన స్థలం

- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- మండలం ఏర్పడి ఏళ్లు..
- సొంత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలు
- బుగ్గారంపై దృష్టిసారించాలని కోరుతున్న ప్రజలు

బుగ్గారం: బుగ్గారం నూతన మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా మండలకేంద్రంలో ఒక్క ప్రభుత్వ కార్యాలయ భవనం నిర్మాణం కాలేదు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ ఇతరశాఖలకు చెందిన భవనాల్లోనే ఉన్నాయి. సొంత భవనాల నిర్మాణానికి రూ.కోట్ల నిధులు మంజూరైనా అడుగు ముందుకు పడడం లేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరగా.. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలపై దృష్టిపెట్టాలని బుగ్గారం ప్రజలు కోరుతున్నారు.


మంజూరైన నిధులు

మండలంలో అవసరమైన తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు పెద్ద కమ్యూనిటీ హాల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ల నిర్మాణాలకు రూ.3.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సుమారు ఆరు నెలల క్రితమే పనులకు టెండరు ప్రక్రియ పూర్తయినట్లు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. రూ.20లక్షలు వెచ్చించి ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం గ్రామశివారులోని ఎదురుబోర్ల వద్ద ఉన్న గుట్టబోర్లను చదునుచేశారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడానికి అవసరమైన మూడు ఎకరాల స్థలం అందుబాటులో ఉందని స్థానిక అధికారులు తెలిపారు.

భిన్నాభిప్రాయాలు

ప్రభుత్వ భవనాలు ఏర్పాటు చేసే స్థలం విషయంలో ప్రజల నుంచి పెద్దగా అభ్యంతరాలు లేకున్నా మండలంలోని కొంతమంది నాయకుల మధ్య ఏర్పడిన భిన్నాభిప్రాయాలు పనులను ముందుకు సాగనివ్వడం లేదు. కొందరు బుగ్గారం సమీపంలోనే ప్రభుత్వ భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తుండగా.. మరికొందరు గ్రామశివారులోని గోపులాపూర్ మార్గంలోని ఎదురుబోర్ల ప్రాంతంలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచిస్తున్నారు. ఇటీవలి ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు భవనాల నిర్మాణం కోసం గోపులాపూర్ రోడ్డులోని గుట్టల ప్రాంతంలోనే రూ.20లక్షల వ్యయంతో స్థలాన్ని చదును చేశారు. ప్రభుత్వం మారడంతో పాటు మండలకేంద్రంలోని ప్రజలు, పలువురు నాయకులు ఈ స్థలంలో కాకుండా మండలకేంద్రంలోనే ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

టెండర్లు పూర్తయ్యాయి



మండలంలో అవసరమైన పలు ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు కావడమే కాకుండా టెండర్లు సైతం పూర్తయ్యాయి. గోపులాపూర్ రోడ్డులో స్థలాన్ని సైతం చదునుచేయడం జరిగింది. స్థలం విషయం కొలిక్కి రాగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు ప్రారంభమవుతాయి.

– లక్ష్మణ్‌రావు, పంచాయతీరాజ్ విభాగం, డీఈఈ

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


నక్క నర్సయ్య(ఫైల్)

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేట శివారులో ఆర్టీసీ బస్సు,ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. బుధవారం మెట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మెట్‌పల్లి నుంచి ఖానాపూర్ వెళ్తోంది. ఇదే సమయంలో సత్తక్కపల్లికి చెందిన నక్క నర్సయ్య(45) వేంపేట వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టడంతో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రెండు నెలల క్రితమే సౌదీ నుంచి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నర్సయ్యకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.


బస్సు కిందకు దూసుకెళ్లిన బైక్

దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరులు

జగిత్యాల: దేశం కోసం ప్రాణాలర్పించిన పతేసింగ్, జోరావార్‌సింగ్ వీరులని, వీరి గుర్తుగా వీర్‌బాల్ దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందని జిల్లా సంక్షేమాధికారి భాస్కర్ అన్నారు. బుధవారం వాల్మీకి ఆవాసంలో పిల్లలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పతేసింగ్, జోరావార్‌సింగ్ త్యాగాలను మనం మరువకూడదని అన్నారు. ఈ కార్యక్రమం గురించి ప్రత్యేక వీడియోను, ప్రధానమంత్రి ప్రసంగాన్ని ప్రదర్శించడం జరిగిందన్నారు. జిల్లా పరిరక్షణాధికారి హరీశ్, ప్రొటెక్షన్ ఆఫీసర్ కందుకూరి కరుణశ్రీ పాల్గొన్నారు.


ప్రధానమంత్రి ప్రసంగాన్ని వింటున్న విద్యార్థులు